## కథ

# స్వర్గం

ముచ్చర్ల రజనీశకుంతల

ఆత్మభవబంధాలను తెంచుకుంది.

భౌతికమైన దేహాన్ని వదిలి, ఇక సెలవని, ఈ లోకం నుంచి శాశ్వత వీడ్కోలు తీసుకుంటోంది.

ఇన్నాళ్ళూ నా ఆత్మకు ఆచ్ఛాదనగా నిలిచిన దేహం వంక..పార్థివ దేహం వంక చూసాను. సుఖమయ జీవనంతో ధృడమైన శరీరం...

ఆత్మకు అచ్ఛాదన దేహమైతే, ఆ దేహానికి ఖరీదైన అచ్ఛాదనలు దుస్తులు. మరణించినా దర్పాన్ని వదలని దేహం.

మెడలో బంగారు గొలుసు, చేతివ్రేళ్ళకు వజ్రం పొదిగిన ఉంగరాలు..ఈ సమాజంలో వున్న ఆర్థిక స్థాయిని సూచిస్తున్నాయి. శరీరంపై ఎన్ని ఖరీదైన ఆభరణాలు వున్నా, ప్రాణం పోయినప్పుడు ఆ దేహానికి విలువ ఏముంటుంది?

శరీరం క్రమేపీ చల్లబడి..క్రమక్రమంగా శిధిలమవుతూ..దుర్వాసన వెదజల్లుతూ..చివరికి పురుగులుగా మారి..మనల్ని ప్రేమించిన ఆత్మీయులే, .ఏహ్యాభావంతో దూరం జరిగేలా చేస్తుంది.

దేహానికి ఆత్మప్రాణంగా వున్నంత వరకే ఈ గౌరవాలు, అభిమానాలు..ఎప్పుడైతే దేహం మృతదేహం అవుతుందో..ఈ మనుష్యులు అనుబంధాలను మెల్లి మెల్లిగా వదిలిపోతూ వుంటారు. ఇప్పుడు నా పరిస్థితి కూడా అదేనా? అయినా నాకు బాధ లేదు. ఎందుకంటే నేనిప్పుడు స్వర్గానికి వె..ళ్తా...ను.

○○○

నాకు పాపభీతి ఎక్కువే. నాకు ఊహ తెలిసినప్పట్నుంచీ స్వర్గం గురించి, నరకం గురించి వింటూనే వున్నాను. నరకం అంటే భయం..పాపాలు చేసే వాళ్ళు నరకానికి వెళ్తారట. అందుకే నాకు ఊహ తెలిసేక ఏ పాపమూ చేయలేదు.

నాకు ఎనిమిదేళ్ళ వయసులో నా పక్క బెంచీలో కూచున్న రాజుగాడి పెన్సిల్ దొరికితే, ఓ రోజంతా దాచిపెట్టాను నేనే ఉంచేసుకుందామని. కానీ స్వర్గం గుర్తొచ్చి, వెంటనే వాడికి నిజం చెప్పి, వాడి పెన్సిల్ వాడికి యిచ్చేసాను.

కాలేజీ రోజుల్లో ఓ అమ్మాయిని ప్రేమించాను. ప్రేమిస్తే పెళ్ళవుతుంది కానీ, కట్నం రాదు అని నాన్న చెప్పినప్పుడు అదీ నిజమేననిపించి, ప్రేమించిన అమ్మాయిని మరిచిపోవాలని అనుకున్నాను. అలా చేస్తే అది పాపం అవుతుందని, నరకానికి వెళ్తానని భయమేసింది. కట్నం రాకపోయినా ఫర్లేదు..చచ్చేక స్వర్గలోక ప్రాప్తి కలిగితే చాలని అనుకున్నాను. అందుకే ప్రేమించిన అమ్మాయినే పెళ్ళి చేసుకున్నాను.

నాతోటి వాళ్ళంతా కట్నం కోసం, కానుకల కోసం భార్యలను పుట్టింటికి పంపినా, నేను మాత్రం ఆ పని చేయలేదు. చేస్తే, నేనూ నరకం వెళ్ళే వాళ్ళ లిస్టులో వుంటాను. అది నాకిష్టం లేదు. స్వర్గం అనే ఎర నన్ను ఆకర్షిస్తూ వుంది.

వ్యాపారం మొదలుపెట్టాను. నా చదువుకు తగిన ఉద్యోగం వస్తుంది. అయితే అందులో ఓ చిక్కు వుంది. గవర్నమెంటు వుద్యోగం చేస్తే లంచాలు తీసుకోవాల్సి రావచ్చు. లేదా నేనెంత నిజాయితీగా వున్నా, అవతల వ్యక్తి నా పై అధికారి ఓ తప్పు చేయమంటే చేయాలి. అదే వ్యాపారం అయితే నా ఇష్టం వచ్చినట్టు చేసుకోవచ్చు. అందుకే వ్యాపారాన్ని ఎంచుకున్నాను.

వ్యాపారంలో దిగేక కానీ నాకు దానిలోని లోతు అర్థం కాలేదు. వ్యాపారంలో రాజకీయాలు, లౌక్యాలు అవసరం. అవసరమైతే ఎదుటివాడిని తప్పించడం కూడా అవసరమే కానీ అలాంటి అవసరాన్ని నేనెప్పుడూ ఆశ్రయించలేదు. చిత్తశుద్ధితో, ఏ పాపమూ చేయకుండా వ్యాపారం చేయలేనా? అయితే అందుకు నేను చాలా కష్టపడవలసి వచ్చింది.

ముఖ్యంగా శత్రువులు లేకుండా కేవలం ప్రత్యర్థులు మాత్రమే వుండేలా చూసుకోవడం ఎంత కష్టమో అనుభవంలోకి వచ్చేక కానీ నాకు అర్థం కాలేదు. అయినా సరే, ఆ కష్టం నాకు ఇష్టం అనిపించింది. ఆ కష్టంలో నాకు మరణానంతరం లభించే స్వర్గం కనిపించింది.

నా భార్యను ప్రేమగా చూసుకున్నాను. నా పిల్లలను ప్రేమించాను. వాళ్ళకి ఏ లోటు రాకుండా చూసుకున్నాను. నా మనసును నిగ్రహించుకున్నాను. పరస్త్రీ వ్యామోహం పాపం కిందికే వస్తుందని, వ్యామోహానికి బానిసను కాలేదు.

ప్రతిరోజు రాత్రి నిద్రపోయే ముందు, ఆరోజు నేను ఏదైనా తప్పు చేసానా? పాపం చేసానా, ఎవరినైనా దూషించానా? ఎవరినైనా నొప్పించానా? అని ఆలోచించుకునే వాడిని. పొరపాటున నేను ఏదైనా తప్పు చేస్తే ఆ మరుసటి రోజు సరిదిద్దుకునే వాడిని. దానికి తోడు నాకు మరింత పుణ్యం కావాలి. నాలో పాపభీతిని వదిలించే పుణ్యం కావాలి.

అందుకు మార్గం దైవప్రార్థన, భగవంతుడి సన్నిధానం. రోజూ పూజలు, పునస్కారాలు. నా భార్య అయితే అప్పుడప్పుడూ ఆటపట్టిస్తూ వుండేది. ఇంట్లో భార్యలకు దేవుడి మీద వుండే భక్తికి మీ భక్తి రెట్టింపుగా వుంది. నా అక్కౌంట్‌లో కన్నా, మీ అకౌంట్‌లోనే పుణ్యం ఎక్కువగా వుందని..

ఆ పుణ్యం కోసమే నేను ఈ భక్తి మార్గాన్ని ఎంచుకున్నానని తెలియదు. అనుక్షణం ఆందోళన..భయం..ఎప్పుడే పాపం చేస్తానో..అందుకే ఎప్పటికప్పుడు నన్ను నేను ప్రమత్తుడ్ని చేసుకుంటూ ముందుకు సాగిపోయేవాడిని. కాలచక్రం ఒకే వేగంతో, ఎటువంటి పక్షపాతాలు లేకుండా ప్రకృతితో కలిసి కదిలిపోతూ వుంటుంది. ఋతువులు, నెలలు, సంవత్సరాలు, దశాబ్దాలు.

వృద్ధాప్యం సమీపించింది. నా వ్యాపార బాధ్యతలు పిల్లలకు అప్పగించాను. దానితోపాటు ఆస్తిపాస్తులు కూడా. కోడళ్ళు వచ్చారు. మనవళ్ళు పుట్టుకు వచ్చారు. అయినా నా పుణ్యకార్యాలు కొనసాగుతూ వున్నాయి.

ఇలాంటి భర్త దొరకడం నా పూర్వజన్మ సుకృతం అని నా భార్య.

ఇలాంటి తండ్రి కడుపున ఎన్నో జన్మలు తపస్సు చేస్తే కానీ పుట్టం అని నా పిల్లలు.

ఇలాంటి మామయ్య ఇంటికి కోడలుగా రావాలంటే పెట్టిపుట్టాలని నా కోడళ్ళు.

మనవళ్ళ ముద్దు ముచ్చట్లు.

నా శేషజీవితాన్ని దైవసన్నిధిలో గడపాలని నిర్ణయించుకున్నాను. నేను నేనుగా వానప్రస్థం స్వీకరించాను. శేషజీవితంలో నా జ్ఞాపకాన్ని శేషంగా వదిలి, ఈ భవబంధాలను తొడుగులుగా విడిచి, ఆత్మతో గాలిలో కలిసాను.

నేను చ..చ్చి..పో..యా..ను.

నేను చేసిన పుణ్యమే నన్ను స్వర్గానికి తీసుకు వెళ్తుంది. ఇది నిశ్చయం.

ooo

కళ్ళు తెరిచాను.

ఎదురుగా స్వర్గం.

ఇదేమిటి స్వర్గం మసకబారి వుంది. అప్సరసలు అటు, ఇటు తిరుగుతున్నారు. ఈ స్వర్గంలో నేను ఒక్కడినే వున్నాను. అప్సరసలు నాకు అమృతాన్ని అందిస్తున్నారు. నాట్యం చేస్తున్నారు. వీనులవిందైన సంగీతం..నేను మనసులో ఏది అనుకున్నా క్షణాల్లో నా ముందు ప్రత్యక్షమవుతోంది.

రోజులు గడుస్తున్నాయో..కాలం స్థంభించిందో తెలియని అయోమయస్థితి..రాత్రి తెలియదు..పగలు తెలియదు. సూర్యచంద్రుల ప్రమేయం లేని స్వర్గమా?

ఆకలి తెలియదు. కానీ అమృతం తాగుతూనే వున్నాను. కంటి మీద నిద్రలేదు. కానీ నిద్రపోయిన భావన వుంది. నేను ఎక్కడైనా సంచరించొచ్చు..నాకా స్వేచ్ఛ వుంది. కానీ నేను ఎక్కడికి వెళ్తన్నాను. ఉద్యానవనాలు, పచ్చిక బయళ్ళు. విశ్రమించ దానికి మందిరాలు..కానీ నేను ఒక్కడినే. ఈ ప్రపంచంలో నేను ఒక్కడినే పుణ్యం చేశానా? అప్పుడు చూసాను. కనుచూపు మేరలో స్వర్గం కనిపిస్తోంది. ఆ స్వర్గంలో వెలుగు దేదీప్యమానమై వుంది. అప్సరసల మొహంలో కళకళ కాంతులు..మనుష్యులున్నారు. హడావిడి వుంది. కానీ అటువైపు వెళ్ళలేకపోతున్నాను. ఎందుకు..ఎందుకని? ఎలుగెత్తి దేవుడ్ని అడిగాను.

నా ఎదురుగా వెలుగు..ఆ వెలుగులో దేవుడు..ఆయన చుట్టూ కాంతిపుంజాలు.


"ఏం కావాలి?" దేవుడి చిర్నవ్వులోనే స్వర్గం కనిపించింది.

"స్వర్గం కావాలి" చెప్పాను స్థిరంగా

"నువ్విప్పుడు స్వర్గంలోనే వున్నావు కదా?"

"ఈ స్వర్గం నాకొద్దు. అదిగో ఆ కనిపించే స్వర్గం కావాలి"

"నువ్వా స్వర్గాన్ని కోరుకున్నావా?"



"అవును...అందుకే ఎన్నో కోరికలను చంపుకున్నాను. ఎన్నో యిష్టాలను వదులుకున్నాను. నా సమయాన్ని నీ భక్తి కోసమే, నిన్ను పూజించడం కోసమే వెచ్చించాను. అయినా ఈ రెండు స్వర్గాలేమిటి..ఈ స్వర్గం త్రిశంకు స్వర్గం కాదు కదా" దేవుడ్ని అడిగాను.

"కాదు..ఈ స్వర్గం భ్రాంతి స్వర్గం"

"భ్రాంతి స్వర్గమా? ఇక్కడెవ్వరూ లేరే..అయినా ఇదేం స్వర్గం?"

"ఉన్నారు. నీలా స్వర్గం రావడం కోసమే పుణ్యం చేసినవాళ్ళు, చేసిన పాపాలను కడిగేసుకోవడం కోసం పుణ్యం చేసిన వాళ్ళూ వున్నారు. కానీ నీకు

వాళ్ళు కనిపించరు. నీ పక్కనే వున్నారు. వాళ్ళు నీలా ఇతరుల కోసం అన్వేషిస్తు న్నారు. అయినా ఒకరికి మరొకరు కనిపిం చరు"


"ఈ స్వర్గంలో ఆనందం లేదు. తృప్తి కల గడం లేదు. అప్సరస మొహంలో బాధ్యత తప్ప కళ లేదు. ఈ అమృతం చేదుగా అనిపి స్తోంది. అనిద్ర బాధగా వుంది. ఎందుకిలా జరుగుతోంది?" దేవుడు చెప్పసాగాడు.

"నువ్వు మరణానంతరం స్వర్గాన్ని కోరు కున్నావు. అందుకోసమే స్వర్గాన్ని ఆశించే నువ్వు పుణ్య కార్యాలు చేసావు. దైవనామస్మరణ చేసావు. నీ ప్రతీ పనిలోనూ స్వర్గానికి వెళ్ళాలనే స్వార్థం వుంది. నీ మనసులో పుణ్యం చేయాలనే తలంపు లేదు. మనస్ఫూర్తిగా దేవుణ్ని ప్రార్థించాలనే భక్తిభావం లేదు. స్వర్గాన్ని ఆశించి, ప్రతిఫలాన్ని కోరుతూ చేసే నీ ప్రతీ క్రియ...నీకు స్వర్గలోక ప్రాప్తిని కలిగించింది. కానీ, ఆ స్వర్గం భ్రాంతి స్వర్గంగా మారింది. మనోవాక్కాయ కర్మ లతో, చిత్తశుద్ధితో, ఆత్మసంతృప్తి కోసం చేసే పుణ్యమే నిజమైన స్వర్గానికి అర్హుణ్ని చేస్తుంది. తప్పులు చేసి ముడుపులు చెల్లించుకో వడం...ప్రతిఫలాన్ని ఆశించే పుణ్యకార్యాలు చేయడం..పాపభీతికోసమే వాటికి దూరంగా..ఇవన్నీ వ్యక్తి స్వార్థానికి వుండే పార్శ్వాలు..."

"అంటే నేను చేసిన పుణ్యం..దైవనామస్మ రణ..." అని ఆగిపోయేను. దేవుడి మాటలతో నాలో ఎంతో ఆత్మశోధన.

దేవుడు నవ్వాడు. ఆ నవ్వులో నాకు ఈ సృష్టి సత్యం బోధపడింది.

దేవుడు కొనసాగించాడు..."స్వర్గం కావా లంటే భూమ్మీదే వుంది. ఎవరికి వారు ఇతరు లకు మంచి చేస్తూ, ఆనందంగా బతకడాన్ని మించి మరో స్వర్గం ఏముంది? నిష్కామకర్మలతో, ఇతరు లకు హాని చేయకుండా, నీ జీవితకాలాన్ని సంతో షంగా, స్వార్థరహితంగా, ఆహ్లాదభరితంగా గడిపే అవకాశం మీ మానవులందరికీ వుంది. అందులో మీకు మీరే సృష్టించుకునే స్వర్గం వుంది. జీవించినన్నాళ్ళూ ఆ స్వర్గంలో బ్రతికి భవబంధాలు తెంచుకున్నాక, ఇక్కడ ఈ స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయి. మీరు వాటిని విస్మరించి, భూమ్మీద ధనం, కీర్తి, కాంక్ష, వ్యామోహం, స్వార్థం లాంటి వాటికి బానిసై, అందులోనే స్వర్గం వుందని, అను క్షణం వాటి సాధనలో అసలు స్వర్గాన్ని విస్మరిస్తున్నారు. ఇతరు లను బాధిస్తూ భయపెడుతూనో, మీరూ భయపడుతూ, బాధించబ డుతూ శేషభాగం ఆందోళనతో గడిపేస్తారు"




దేవుడి మాటల్లో లాజిక్ వుంది. గొప్ప మ్యాజిక్ వుంది. జీవిత సత్యం అనే మ్యాజిక్ వుంది. బ్రతికి వుండగానే కృత్రిమ స్వర్గాన్ని సృష్టిం చుకుని బ్రతికే మనుష్యులకు దేవుడు ఈ విధంగా గుణపాఠం చెబుతాడా?

దేవుడు ముందు మోకరిల్లాను.

"ప్రభూ...నాకీ స్వర్గం వద్దు. సంతృప్తిలోనే స్వర్గం వుందని, ఏ స్వర్గాన్ని ఆశించకపోవడమే స్వర్గమని తెలిసి వచ్చింది. నాకు మరొక్క అవకాశం ఇవ్వు. మళ్ళీ మనిషిగా జన్మించే వరం ఇవ్వు. నేను స్వర్గాన్ని సృష్టించుకుంటాను. ఇతరుల కోసం స్వర్గాన్ని సృష్టి స్తాను. నువ్వు చెప్పిన సృష్టిరహస్యాన్ని ఈప్రపంచానికి చాటి చెబుతాను."

దేవుడు చిర్నవ్వు చిందించాడు. క్రమక్రమంగా అంతర్ధానమవుతున్నాడు.



"ఈ సత్యాన్ని ఎవరికి వారే తెలుసుకోవాలి.." అన్న దేవుడి ఆంతర్యం తెలుస్తోంది.

నేను దేవుణ్ని ఏదో అడగా లని అనుకుంటూ వుండ గానే...నాలో పశ్చా త్తాపం..పరివర్తన..ప్రాయ శ్చిత్తం చేసుకోవాలనే భావమే..నన్ను అసలైన స్వర్గంలోకి విసిరివేయబ డ్డట్టు..నా ఆత్మ నా కళ్ళెదు రుగా కనిపించిన స్వర్గం వైపు వె..ళ్తోం..ది.

"నా ప్రియమైన తోటి మనుష్యుల్లారా..మీకు నిజ మైన స్వర్గానికి ఆహ్వానం పలుకుతున్నాను. జీవితాన్ని స్వర్గం చేసుకొని జీవితాన్ని ముగించేక కూడా స్వర్గం లోకి చేరుకోండి. మీకిదే నా ఆహ్వానం..."

నా ఆత్మ నిజమైన స్వర్గం లోకి ప్రవేశించింది.

## చాలా కాలం తర్వాత...

తెలుగులో గ్లామరస్ స్టార్‌గా కొంత కాలం వెలుగు వెలిగిన గజాలా ఇక్కడ అవకాశాలు తగ్గ డంతో తమిళ రంగానికి వలస వెళ్లింది. అక్కడ ఆమె అదృష్టం కలిసొచ్చి బిజీ హీరోయిన్‌గా మారింది. చాలా కాలం గ్యాప్ తర్వాత ఇప్పుడు తిరిగి తెలుగు తెరకి రాబోతోంది. శ్రీహరి హీరోగా నటిస్తున్న కొత్త చిత్రంలో అతని సరసన గజాలా నాయికగా నటిస్తోంది. ఈ సినిమాతో గజాలా తెలు గులో తిరిగి బిజీ అవుతుందేమో చూడాలి.